తోపుడు బండ్లతో చిరు వ్యాపారులు విలవిల!

- బడ్డీకొట్ల యజమానుల సంఘం షాపింగ్ కాంప్లెక్స్‌కు తోపుడు బండ్ల ఆటంకం
- రాజకీయ నాయకుల అండతో తొలగించని వైనం



బడ్డీకొట్ల యజమానుల సంఘం షాపింగ్ కాంప్లెక్స్

జగ్గయ్యపేట అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చిరు వ్యాపారులకు జీవనోపాధి కల్పించేందుకు పట్టణంలోని రైతుబజారు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేశారు. ఆర్‌ఎస్ బడ్డీ కొట్ల యజమానుల సంఘం పేరుతో సొంతంగా కాంప్లెక్స్ నిర్మించి లీజు చెల్లిస్తున్న ఈ షాపింగ్ కాంప్లెక్స్‌కు నేడు తోపుడు బండ్ల వ్యాపారులు ఆటంకం కలిగిస్తున్నారు. కాంప్లెక్స్‌కు ఎదురుగా కాంప్లెక్స్‌కు సంబంధం లేని కొందరు వ్యక్తులు తోపుడు బండ్లను అడ్డుగా పెట్టి వారి జీవనోపాధిని దెబ్బతీస్తున్నారు. దీంతో కాంప్లెక్స్ షాపుల వారు అద్దెలు చెల్లించి మరీ నష్టపోతున్నారు. బండ్లను తొలగించమని వేడుకుంటున్న తమకు రాజకీయ నాయకులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని కాంప్లెక్స్ వ్యాపారులు వాపోతున్నారు.

ఏడాదిన్నర కాలంగా కష్టకాలం..

32 మంది చిరు వ్యాపారులు షాపులు నిర్మించి ఇక్కడ వ్యాపారం చేసుకుంటున్నారు. చెప్పుల షాపులు, వంట పాత్రలు, పాత వస్త్రాల వ్యాపారం, సెలూన్ సెంటర్, సెల్ సర్వీసింగ్, కుండల వ్యాపారం తదితర చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అంతంత మాత్రంగా సాగుతున్న తమ వ్యాపారాల ముందు ఏడాదిన్నర కాలంగా కొందరు తోపుడు బండ్ల వ్యాపారులు బండ్లను అడ్డుపెట్టి వ్యాపారాలు చేయడంతో కాంప్లెక్స్ వ్యాపారులు కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నారు. తమ షాపుల ముందు అడ్డుగా ఉన్న తోపుడు బండ్లను పెట్టవద్దని.. వాటిని తొలగించాలని విన్నవిస్తున్నా తోపుడు బండ్ల వ్యాపారులు వినడం లేదని కాంప్లెక్స్ వ్యాపారులు వాపోతున్నారు. దీనిపై పోలీసులు, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపాలిటీ వారికి వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కాంప్లెక్స్‌కు ఎదురుగా తోపుడు బండ్ల వ్యాపారులు

వడ్డీకి తెచ్చి అద్దె కడుతున్నా..



ఏడాదిన్నరగా షాపింగ్ కాంప్లెక్స్ ముందు కొందరు వ్యక్తులు తోపుడు బండ్లు అడ్డుగా పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో నా వ్యాపారం సరిగా సాగక షాపు మూసివేశాను. ఆర్థికంగా ఇబ్బందిగా ఉంది. ఊపిరితిత్తుల జబ్బుతో బాధపడుతున్నా. షాపు అద్దె కూడా కట్టే పరిస్థితి లేక వడ్డీకి తెచ్చి లీజు చెల్లిస్తున్నాను. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– బత్తుల గురుస్వామి, ఆర్‌ఎస్ షాపింగ్ కాంప్లెక్స్ చిరువ్యాపారి

వ్యాపారం సరిగా సాగడంలేదు..



పాత బట్టల వ్యాపారం చేసుకుంటున్నాను. మా షాపుల ముందు తోపుడు బండ్లు అడ్డుగా పెట్టడంతో నా వ్యాపారం దెబ్బతింటుంది. షాపునకు నెలకు రూ.2000 అద్దె కడుతున్నాం. అడ్డుగా పెట్టిన తోపుడు బండ్లను తొలగించమంటే రాజకీయ నాయకులతో రికమండేషన్లు చేయిస్తున్నారు.

– రాయల కోటేశ్వరి, ఆర్‌ఎస్ షాపింగ్ కాంప్లెక్స్, చిరువ్యాపారి

తోపుడు బండ్ల వారికి నోటీసులు పంపిస్తాం..



గత కొంత కాలంగా టౌన్ ప్లానింగ్ అధికారి లేరు. ఈ మధ్యనే కొత్తగా వచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి కాంప్లెక్స్‌లో షాపులు నిర్వహించుకుంటున్న ఆర్‌ఎస్ బడ్డీకొట్ల యజమానుల సంఘం వారి షాపుల ముందు అడ్డుగా పెట్టిన తోపుడు బండ్ల వారికి నోటీసులు పంపిస్తాం. తోపుడు బండ్ల వ్యాపారుల అడ్డు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– తులసి వెంకట కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

పాఠశాలకు బల్లలు అందజేత



మక్కపేట(వత్సవాయి): గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలకు రూ.15 వేలు విలువ చేసే మూడు బల్లలను దాతలు మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన వల్లూరి సుబ్బారావు, పేరం వెంకటేష్, రాంబ్రహ్మాచారిలు కలిసి బల్లలను పాఠశాల హెచ్‌ఎం షేక్ తారాభీకి అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలకు కావాల్సిన మౌళిక వసతులకు గ్రామస్తులు అండగా నిలవడం హర్షణీయమన్నారు. దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీడీపీ ప్రసాద్, జానీ, అజ్మీరు శ్రీను, నాగలక్ష్మీ, సీఆర్పీ రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ప్రసాదరావు

నందిగామ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జిల్లా ఉన్నతాధికారులు ప్రసాదరావును నియమించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసరావు పదోన్నతిపై డ్వామా ఏపీడీగా బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో అద్దంకి ఎంపీడీవోగా పని చేస్తున్న ప్రసాదరావు బదిలీపై ఇక్కడకు రానున్నారు. ప్రస్తుతం కార్యాలయ ఏవో సబిత ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆలయ ఈవోగా సీతారావమ్మ..

నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలో కొలువైన సత్యమ్మ అమ్మవారి ఆలయ ఇన్‌చార్జ్ ఈవోగా సీతారావమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని గుంటూరు సీతారామయ్య అన్నదాన సత్రం ఈవోగా పని చేస్తున్న ఆమెకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సత్యమ్మ అమ్మవారి ఆలయ ఇన్‌చార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం



వత్సవాయి: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విజిలెన్స్ ఈఈ పి.విజయకుమారి తెలిపారు. మంగళవారం మండలంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కల్యాణ మండపంలో తనిఖీలు నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విద్యుత్ లోడ్ తక్కువగా ఉన్న మీటర్లు, అదే విధంగా విద్యుత్ చౌర్యం చేసే వారిని గుర్తించాలని అన్నారు. మీటర్లు లేకుండా విద్యుత్‌ను వాడుకునే వారిని గుర్తించాలని తెలిపారు. వత్సవాయి సెక్షన్ కింద మొత్తం 45 టీంలుగా ఏర్పడి 498 విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వారికి మొత్తం రూ.2.50 లక్షల అపరాధ రుసుం వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ఎం.వసంతరావు, విజిలెన్స్ సిబ్బంది, ఎల్‌ఐ బాణావతు కోటయ్య, లైన్‌మెన్ రవి తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడు మృతి

జగ్గయ్యపేట అర్బన్: పురుగు మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ–2 వివరాల ప్రకారం.. మిట్టగూడెంకు చెందిన వివాహితుడు షేక్ బాజీ(30) వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం, ఇతర వ్యసనాలకు లోనైన ఆయన కుటుంబ జీవనాన్ని పట్టించుకోకుండా ఉండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో సోమవారం అతను పురుగు మందు తాగి ఇంటికి రాగా, కుటుంబ సభ్యులు గమనించి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాజీ మృతి చెందాడు. మృతుని భార్య మౌలాబి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ–2 బి.శంకరనాయక్ మంగళవారం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి 3 ఏళ్ల వయస్సు గల కుమార్తె ఉంది.

విగ్రహం ధ్వంసం కేసులో ముగ్గురి అరెస్ట్

తిరువూరు: గంపలగూడెం తోటమూల సెంటర్‌లోని దివంగత సర్పంచి ఇనుగంటి రాంబాబు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తిరువూరు సీఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో రాంబాబు విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసినట్లు ఇనగంటి మధుసూదనరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంపలగూడెం మండలం పెదకొమెరకు చెందిన కొంగల వినాయకరావు, మోదుగు శ్రీనివాసరావు, ఇడుపులపాటి రాంబాబులను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరిచారు. నిందితులను 14 రోజుల రిమాండ్‌కు మేజిస్ట్రేట్ ఆదేశించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

కంచికచర్ల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దిబ్బయ్య మంగళవారం తెలిపారు. కంచికచర్ల పట్టణంలోని వసంతకాలనీ, జుజ్జూరు రోడ్డు, హనుమాన్‌పేట, ఇందిరాకాలనీ, జగనన్నకాలనీ, గొట్టుముక్కల రోడ్డు, పోలీస్‌స్టేషన్, గవర్నమెంట్ ఆసుపత్రి ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన అన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రంగనాయకుడి ఆలయంలో ఉట్లోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీరంగనాయక స్వామి వారి ఆలయంలో మంగళవారం ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆలయంలో నిర్వహించారు. కాగా మంగళవారం శ్రీ భూ సమేతుడై రంగనాథుడు శేషవాహనంపై విహరించగా.. వైభవంగా ఉట్లోత్సవాన్ని జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమాన్ని తిలకించారు. యువకులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

మ్యాజిక్ డ్రైన్‌లతో పెరగనున్న భూగర్భ జలాలు


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జాతీయ మీడియా సభ్యులు

నందిగామ రూరల్: మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణం వల్ల మురుగు, ఇళ్లలోని వాడుక నీరు భూమిలోకి ఇంకడం వల్ల భూగర్భ జలాలు పెంపొందుతాయని డ్వామా పీడీ రాము పేర్కొన్నారు. మండలంలోని సోమవరం గ్రామంలో చేపడుతున్న మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణ పనులను ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బృంద సభ్యులు (జాతీయ మీడియా సభ్యులు) మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పీడీతో పాటు పలువురు అధికారులు ఫొటో ప్రదర్శనతో మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణ వివరాలను బృంద సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణం తక్కువ ఖర్చుతో కూడుకున్నదన్నారు. ఈ డ్రైన్‌ల వల్ల మురుగు నీరు పారుదల సమస్యతో పాటు దుర్వాసన సైతం ఉండదని తెలిపారు. ముఖ్యంగా వాడుక నీరు, మురుగు నీరు భూమిలోకి ఇంకిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో ఆనంద్, డీఎల్‌పీవో రాఘవన్, విజయవాడ క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సబిత, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ఓజోన్ పొర ఆవశ్యతను వివరిస్తున్న విద్యార్థులు


వీరులపాడు అవగాహన ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెనుగంచిప్రోలు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని హెచ్‌ఎం నక్కా బాబూరావు అన్నారు. ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎస్‌ఎస్‌పీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఓజోన్ పొర ఆకారాన్ని ప్రదర్శించారు. పీడీ వేగినేటి వెంకట రమణ ఆధ్వర్యంలో విద్యార్థులు గుండ్రంగా నిలబడి, మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఓజోన్ పొర ప్రపంచానికి ప్రమాదకరమైన సూర్య కిరణాలు తగలకుండా కాపాడుతుందన్నారు. ఇటీవలన పెరుగుతున్న కాలుష్యం వల్ల ఓజోన్ పొర దెబ్బతింటుందని వివరించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులు ఉష, నాగజ్యోతి, శిల్ప, స్వర్ణలత, స్వాతి ఓజోన్ పొర గురించి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

వీరులపాడు: అడవులను పెంచడం వల్ల ఓజోన్ పొరను పరిరక్షించుకోవచ్చని జిల్లా సైన్స్ అధికారి పిచ్చేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని జమ్మవరం, వీరులపాడు గ్రామాల పాఠశాలల్లో మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల నుంచి వెలువడే వాయువుల వల్ల వాతావరణానికి ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు. అనంతరం గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సూరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ టౌన్: ఓజోన్ పొరను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రంథాలయ అధికారి రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలోని మొక్కలకు విద్యార్థులతో కలిసి నీటిని పట్టారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి


సీనియర్ అసిస్టెంటుకు వినతిపత్రం అందజేస్తున్న టైలర్లు

తిరువూరు: టైలరింగ్ వృత్తిలో జీవించే కుటుంబాలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని తిరువూరు మండల టైలర్స్, వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో టైలరింగ్ వృత్తిదారులు తమ డిమాండ్ల అమలు కోరుతూ మంగళవారం ఆందోళన నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ టైలరింగ్ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, కుట్టుమిషన్లు ఉచితంగా అందజేయాలని, పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టే అవకాశం టైలర్లకు కల్పించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, టైలర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోట శాంతకుమారి, సత్తార్, తుల సీరాణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని నిరసన


నిరసన కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు

మైలవరం: రోడ్డుపై నీరు నిలవకుండా డ్రెయినేజీ నిర్మించాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. చంద్రగూడెం మసీదు సెంటర్ వద్ద నీళ్లలో నిలబడి మంగళవారం నిరసన తెలిపారు. వజ్రాల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షానికి సైతం చంద్రగూడెం గ్రామంలోని మసీదు సెంటర్ వద్ద రహదారిపై నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోజుల తరబడి వర్షం నీరు నిలిచి దుర్వాసన వస్తోందని వాపోయారు. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సూరిబాబు, సదాశివరావు, బోలగాని రాజా, వి. నాగేశ్వరరావు, సంగు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వానరాలు



కంచికచర్ల: మండలంలో పరిటాలలో వానరాల బెడద ఎక్కువగా ఉంది. వానరాలు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లల్లోకి చొరబడి చిన్నారులపై విరుచుకు పడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికే గ్రామంలో 10 మందిని పైగా వానరాలు కరిచాయని.. వారంతా కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్స చేయించుకున్నారని తెలిపారు. రైతులు సాగుచేసిన పంటలను సైతం వదలిపెట్టకుండా వానరాలు నాశనం చేస్తున్నాయని అంటున్నారు. వానరాలను అటవీ ప్రాంతానికి తరలించాలని గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపినా ఫలితం లేదని స్థానికులు పేర్కొన్నారు. గ్రామంలోని వానరాలను అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో మంగళవారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, డెప్యూటీ ఎంపీడీవో కె.సుబ్బారావు, కార్యదర్శి శ్యామ్ పర్యవేక్షణలో మురుగు కాలువలు శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లారు. అలానే దోమల నివారణ మందును మురుగు ఉన్న ప్రాంతాల్లో పిచికారీ చేయించడంతో పాటు గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.

ద్విచక్ర వాహనం అపహరణపై కేసు

నందిగామ టౌన్: ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కొంగర అనంతయ్య పట్టణంలోని కేవీఆర్ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్నారు. మధ్యాహ్న సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలుపుదల చేసి ఇంట్లోకి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ఆవరణలోని వాహనాన్ని అపహరించారు. కొద్దిసేపటి తరువాత బయటకు వచ్చిన ఆయనకు ద్విచక్ర వాహనం కనిపించక పోవడంతో అపహరణకు గురైందని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అభిమన్యు తెలిపారు.

నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీ హనుమంతరావు

పేరకలపాడు(కంచికచర్ల): మండలంలోని పేరకలపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించామని మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ కె.విజయకుమారి మాట్లాడుతూ.. పీఎం ప్రణమ్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ పంటలకు ఎరువుల వినియోగం తగ్గించి నానో ఎరువులను, నానో డీఏపీ జీవనఎరువుల వాడకాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. దీని ద్వారా నేల సంరక్షణ, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. అనంతరం రైతులతో కలిసి సాగుచేసిన పంట పొలాలను పరిశీలించారు. గాలికుంటు వ్యాధుల నివారణకు పశు సంవర్ధక శాఖ వైద్యుల సలహాల మేరకు అవసరమైన మందులు వాడాలన్నారు. సబ్సిడీ మేత, విత్తనాల పంపిణీ, పశువుల దాణా గురించి పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు వివరించారు. కిసాన్ క్రెడిట్ కార్డు, మినీ గోకులం షెడ్ పథకాల గురించి ఆయన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నందిగామ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మోసెస్, కంచికచర్ల డాక్టర్ జి.వెంగళరావు, మండల పశువైద్యాధికారి కె.విజయ విశ్వనాథ్, సర్పంచి సాత్విక, గ్రామ వ్యవసాయ సహాయకులు షాహిన్, రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగాకూటమి పాలన

నందిగామ రూరల్: ప్రజారోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఆరోగ్య రక్షణ ప్రణాళికలో భాగంగా మండలంలోని చందాపురం గ్రామంలో మంగళవారం ఫీవర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డయేరియా, మలేరియా, ఇతరత్రా జ్వర పీడితులను గుర్తించి అవసరమైన చికిత్స అందించాలన్నారు. ఆశా వర్కర్‌లు, వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సమగ్ర సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్‌లు, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే పథకంపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల భద్రత, గౌరవాన్ని మెరుగు పరచడానికే నమస్తే(నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం) పథకం రూపొందించినట్లు మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావు పేర్కొన్నారు. నమస్తే ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంటల్, పురపాలక సంఘ పబ్లిక్ హెల్త్ వర్కర్, దళిత బహుజన రీసోర్ సెంటర్ ఆర్గనైజేషన్ నుంచి రమాదేవి పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని వేస్ట్ పిక్కర్స్, కబాడీ వాలా యజమానులకు నమస్తే పథకంపై కమిషనర్ అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, స్క్రాప్ షాపు యజమానులు రోడ్లపై చెత్త సేకరించే కార్మికుల వివరాలను సేకరించి మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేయించాలని కోరారు.

అంత్యక్రియలకు అగచాట్లు


చనుబండ పెద్ద చెరువు వద్ద మునిగిన శ్మశానవాటిక స్థలం రోడ్డు

చాట్రాయి: అంత్యక్రియలు చేసేందుకు సరైన స్థలాలు లేక మృతుల కుటుంబ సభ్యులు నానా అగచాట్లు పడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో శ్మశానవాటికలు లేక చెరువుల ముందు, చెరువు గట్ల పక్కన, రోడ్ల పక్కన అంత్యక్రియలు చేస్తున్నారు. చనుబండలో దళితులు అంత్యక్రియలు నిర్వహించే స్థానిక పెద్ద చెరువులోని శ్మశానవాటిక దారి నీళ్లతో మునిగి పోయింది. దీంతో అంత్యక్రియలు నిర్వహించాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళితులకు శ్మశానవాటిక లేకపోవడంతో రోడ్డు పక్కనే అంత్యక్రియలు చేస్తున్నారు. ఈ విధంగా అన్ని గ్రామాల్లో అనువైన శ్మశాన వాటికలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో శ్మశాన వాటికలకు స్థల సేకరణకు ఆదేశాలు ఇచ్చినా నేటి వరకు స్థలాలను ఎంపిక చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ శ్మశానవాటికలు ఉన్నా అంత్యక్రియలు నిర్వహించడానికి సరైన వసతులు లేవని ప్రజలు వాపోతున్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

జి కొండూరు: అన్ని రంగాల్లోని కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జి.కొండూరు మండల తొమ్మిదవ మహాసభ స్థానిక కమ్యూనిటీ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డును వెంటనే ప్రారంభించాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు సత్వరమే విడుదల చేయాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేసి పని భారం తగ్గించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.మహేష్, రైతు సంఘం నాయకుడు ఎస్.ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎస్టీయూ ఏపీ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య డిమాండ్ చేశారు. కొటికలపూడి జెడ్పీ పాఠశాలలో మంగళవారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.